సాక్షి
శ్రీకాకుళం
గురువారం : 26 : జనవరి : 2023



కనకదుర్గ ఆలయంలో చోరీ

లావేరు కనకదుర్గ ఆలయంలో చోరీ జరిగింది. 3.5 తులాల బంగారు, 2 తులాల వెండి ఆభరణాలను దుండగులు అపహరించారు. - 8లో



నేడు బాబా వార్షికోత్సవం

ఆనందపురంలో సాయికోటి మహాస్థూపం వార్షికోత్సవం కీలక ఘట్టానికి చేరుకుంది. గురువారం జరిగే వేడుకకు లక్షన్నర మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. - 8లో

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్టులో 173 మందికి గాను 171 మంది, రెండో షిఫ్టులో 173 మందికి గాను 172 మంది హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100 మందికి గాను 96 మంది, రెండో షిఫ్టులో 100 మందికి గాను శతశాతం హాజరైనట్లు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కొత్తూరులో నకిలీ నోట్ల కలకలం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో నకిలీ రూ.500 నోట్లు కలకలం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా కిరణా షాపులు, వస్త్ర దుకాణాల్లో వీటి చలామణి ఎక్కువగా ఉంటోంది. భామిని, సీతంపేట, హిరమండలంతో పాటు ఒడిశాకు ఆనుకుని ఉన్న గ్రామాలకు కొత్తూరు మార్కెట్ కేంద్రంగా ఉండటం, ఈ ప్రాంతంలో గిరిజనులు రాకపోకలు ఎక్కువగా సాగిస్తుండటంతో అక్రమార్కులు ఇక్కడి మార్కెట్‌ను లక్ష్యంగా పెట్టుకుని నకిలీ నోట్ల దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కొత్తూరు–బత్తిలి రోడ్డులో ఓ వ్యాపారి డెలివరీ బాయ్‌కు రూ.500 నోటు ఇచ్చారు. ఆ నోటు కొత్తూరులోని ఆన్‌లైన్ హబ్ సూపర్‌వైజర్ గమనించి నకిలీదిగా గుర్తించడంతో తిరిగి వ్యాపారికే నోట్‌ను పంపించేసినట్లు తెలిసింది. పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి నకిలీ నోట్లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

గర్భిణిని ఆదుకున్న 108 అంబులెన్స్



మగబిడ్డకు జన్మనిచ్చిన సవర మధు

మందస: గిరిజన ప్రాంతాల్లో 108 అంబులెన్స్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మందస మండలం బసవసాయి పంచాయతీ కారిబంద గ్రామానికి చెందిన సవర మధు అనే మహిళకు బుధవారం ఉదయాన్నే పురిటినొప్పులు రావడంతో 108 కాల్‌సెంటర్‌కు సమాచారం అందించారు. మందస 108 వాహనం సిబ్బంది ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, వాయలపల్లి మురళీమోహన్‌తో పాటు ఆశావర్కర్ సవర మేరీ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో పలాస సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా గొప్పిలి సమీపంలో మధు మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కష్టం బుగ్గిపాలు



కాలిపోయిన వరిచేను కుప్పలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట సమీపంలో పంట పొలాల్లో సుమారు మూడు ఎకరాల వరి చేనుకుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు కుప్పలకు నిప్పంటించారని బాధిత రైతులు మామిడి నీలంనాయుడు, ఎండ త్రినాథులు వాపోయారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట బుగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు.

30, 31 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



ఎస్‌బీఐ ప్రధానశాఖ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో సమ్మె చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు యూనియన్స్ జిల్లా కన్వీనర్ కేసీహెచ్ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచి వద్ద బ్యాంక్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని ప్రకటించారు. వారానికి ఐదు రోజుల పనిదినాలు, పెన్షన్ అప్డేషన్, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానం కొనసాగించడం ప్రధాన డిమాండ్లని తెలియజేశారు. ఈ నెల 27న ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో చర్చలు జరుగుతాయని, సంప్రదింపుల అనంతరం కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రిపబ్లిక్ డే వేడుకలకు
సర్వం సిద్ధం

రిపబ్లిక్ డే వేడుకలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం సిద్ధమైంది. గురువారం జరిగే గణతంత్ర ఉత్సవాలకు సంబంధించిన వేదిక, ప్రదర్శన స్టాళ్లు, సిటింగ్, మౌలిక వసతుల ఏర్పాట్లను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్, ఆర్డీఓ బి.శాంతి పరిశీలించారు. అంతకుముందు ఎస్పీ జి.ఆర్. రాధిక ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, పాఠశాల విద్యార్థులు కవాతు సాధన చేశారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

● బంగారు భారత్



రిపబ్లిక్ డే సందర్భంగా కాశీబుగ్గకు చెందిన కొత్తపల్లి చిన్నాచారి 0.100 మిల్లీ గ్రాముల బంగారంతో భారతదేశ చిత్రపటం తయారు చేశారు. గంటపాటు శ్రమించి ఎటువంటి అతుకులు లేకుండా అశోకచక్రం, జాతీయ జెండా స్పష్టం కనిపించేలా అద్భుతంగా రూపొందించారు. – కాశీబుగ్గ

● ఢిల్లీ పరేడ్‌కు సిక్కోలు క్యాడెట్లు



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన 14– ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు దేశ రాజధాని ఢిల్లీలో గురువారం జరగనున్న గణతంత్ర పరేడ్‌లో పాల్గొననున్నారు. మూడు జిల్లాల ఆర్మీ వింగ్ తరఫున కళాశాలకు చెందిన చంద్రశేఖర్, సాయికుమార్, చైతన్య ఎంపిక కావడం పై ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ యాళ్ల పోలినాయుడు, అధ్యాపకులు, 14వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అమిత్ బెనర్జీ అభినందించారు. –శ్రీకాకుళం న్యూకాలనీ

● అరటి గెలల నివేదన



మండలంలోని కిన్నెరవాడలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో 1008 అరటి గెలలను భక్తులు వేలాడదీశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అరటిగెలలను స్వామి వారికి నివేదించారు. –సారవకోట

● కుక్కకు కర్మకాండ



స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన నెయ్యిల నారాయణరావు అమితంగా పెంచిన కుక్క(స్నూఫీ) మృతి చెందడంతో కర్మ కాండ నిర్వహించి అనుబంధం చాటుకున్నారు. సంక్రాంతి నాడు అనారోగ్యంతో స్నూఫీ మరణించడంతో 12వ రోజైన బుధవారం శుద్ధి కార్యక్రమాలతో పాటు బ్రాహ్మణుల సమక్షంలో కర్మ కాండ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. –నరసన్నపేట

స్కోచ్‌కు సమీపంలో పోలీస్ సేవ

సారా విక్రేతలు, తయారీదారులపై దాడులు చేయడం, నిల్వలు స్వాధీనం చేసుకోవడం, ధ్వంసం చేయడం మామూలే. కానీ ఎన్ని దాడులు చేస్తున్నా సారాను పూర్తిగా ఎందుకు అరికట్టలేకపోతున్నారు? ఈ ప్రశ్నే జిల్లా ఎస్పీ జీఆర్ రాధికను ఆలోచింపజేసింది. సారా ఆదాయం తప్ప వేరే ఆదాయం, ఉపాధి లేకపోవడం వల్లే.. దాడులు, అరెస్టులు చేస్తున్నా వారు మళ్లీ మళ్లీ అటువైపే వెళ్తున్నారని అర్థమైంది. అదే ఆపరేషన్ పరివర్తన్‌కు దారి చూపించింది. సారా కేసుల్లో అరెస్టు చేసిన 203 మందిలో 98 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూపించి పరివర్తన తీసుకొచ్చారు. మరోవైపు పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, వారి ద్వారానే సైబర్ మోసాలు, దిశ యాప్ వంటి వాటిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు క్యాంపస్ కాప్స్ కార్యక్రమం విశేష ఆదరణ పొందాయి. జిల్లా పోలీసుల ఈ రెండు సేవలు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డుకు అడుగు దూరంలోనే ఉండటం విశేషం. –శ్రీకాకుళం క్రైమ్

- స్కోచ్ సమ్మిట్–2022 అవార్డుల రేసులో 'ఆపరేషన్ పరివర్తన్', క్యాంపస్ కాప్స్
- ఫలించిన జిల్లా పోలీసు విభాగం కృషి



స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట, సారా తయారీ సామగ్రితో సెబ్ పోలీసులు (ఫైల్)



సారాతయారీ పాత్రలను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు (ఫైల్)

ఆపరేషన్ పరివర్తన్.. సారా క్రయ విక్రయాలు జరిపేవారు వృత్తి మాని సన్మార్గంలో నడిచేలా మార్పు తీసుకురావడమే కాకుండా వారికి గౌరవప్రదమైన ఉపాధి కల్పనే లక్ష్యంగా పోలీసులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం. ఎస్పీ జి.ఆర్.రాధిక నేతృత్వంలో జిల్లా పోలీసులు అమలు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మక స్కోచ్ సమ్మిట్–2022 అవార్డుల నామినేషన్లలో సెమీఫైనల్ దశకు చేరుకుంది. అలాగే, 'క్యాంపస్ కాప్స్' కార్యక్రమం కూడా స్కోచ్ అవార్డుల నామినేషన్లలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లడం విశేషం.

సారా రహిత జిల్లాయే లక్ష్యంగా..

సారా రహిత శ్రీకాకుళం జిల్లాగా మార్చేందుకు ఎస్పీ జి.ఆర్.రాధిక ఆధ్వర్యంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారి (జేడీ) వి.ఎస్.నాగమణికంఠ, అసిస్టెంట్ కమిషనర్ కె.పి.గోపాల్‌లు తమ సిబ్బందితో ఎనలేని కృషి చేశారు. జిల్లాలోని వివిధ సబ్ స్టేషన్లలో సారా తయారీ గ్రామాలను ఏ– కేటగిరి (05), బి–కేటగిరి (15), సి–కేటగిరి (130)లుగా విభజించి వాటిపై (150 గ్రామాలపై) దాడులు నిర్వహించి గ్రీన్‌జోన్ కేటగిరిలోకి మార్చారు. 239 కేసులు నమోదు చేసి 203 మందిని అరెస్టు చేశారు. 4408.61 లీటర్లు నాటుసారా, 282 కిలోలు నల్లబెల్లం సీజ్ చేసి 79,995 లీటర్లు బెల్లం ఊట ధ్వంసంచేశారు. 25 మంది బెల్లం వర్తకులను బ్యాక్వర్డ్, ఫార్వర్డ్ లింకేజీలో అరెస్టులు చేశారు. దీంతో నాటుసారా తయారీ జిల్లాలో గణనీయంగా తగ్గింది.

ఒడిశా పోలీసులతో కలిసి...

సరిహద్దు రాష్ట్రం ఒడిశాలో ముఖ్యంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతాల్లో ఇప్పటికీ సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నెల 11న జిల్లా సెబ్, పోలీసు అధికారులు ఒడిశా రాష్ట్ర పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో కలిసి దుర్గం, ఏక్మార, మారంగి గ్రామాల్లో దాడులు జరిపారు. 47 వేల లీటర్లు బెల్లం ఊట, 1200 లీటర్ల సారా, 496 ప్లాస్టిక్ డ్రమ్ములు, మట్టి, సిల్వర్ పాత్రలు ధ్వంసం చేశారు.

ఉపాధి కల్పిస్తే మార్పు వస్తుందనే..

- సారా వల్ల కలిగే నష్టాలపై 150 గ్రామాల్లో జిల్లా పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించారు.
- వ్యాపారాన్ని విడిచిపెడితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తుందని భరోసా ఇస్తూ 98 మందిలో పరివర్తన తీసుకొచ్చారు.
- జాబ్‌మేళాలో పలాస (6), ఆమదాలవలస (3), ఎచ్చెర్ల స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి మగ్గం పనులు(3), శ్రీకాకుళం ఎస్సీ కార్పొరేషన్ (3), డీఆర్‌డీఏ ద్వారా రూ.11 లక్షల రుణాలను 34 మందికి అందజేశారు.
- మరో 58 మంది స్వయం ఉపాధి చేసుకుంటూ జీవిస్తున్నారు.
- ఇటీవల కాలంలో సారాతో పట్టుబడుతున్న వారిని గుర్తించి జిల్లా నైపుణ్య శిక్షణా సంస్థ ప్రభుత్వ ఆర్థిక సాయంతో జీవనవిధానాలు మార్చుకునేలా చర్యలు చేపడుతున్నారు.

విద్యార్థుల్లో అవేర్‌నెస్ 'క్యాంపస్ కాప్స్'



2022 జులై 9న ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో పలు కళాశాలల్లో 18 ఏళ్ల దాటిన విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ గంటపాటు పోలీసులతో పాటు ప్రజలకు సేవలందించేలా క్యాంపస్ కాప్స్ కార్యక్రమం రూపొందించారు. ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లాకు చెందిన న్యాయమూర్తులు పలు కళాశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీకాకుళం, టెక్కలి సబ్‌డివిజన్‌ల పరిధిలో 16 కళాశాలలకు చెందిన 291 మంది విద్యార్థులు శిక్షణ పొంది 130 మంది విద్యార్థులు 100 గంటలకంటే ఎక్కువ సమయం (విరామ సమయంలో ఒక గంటపాటు) ఇప్పటివరకు ప్రజలకు సేవలందించారు. పోలీసుల సహకారంతో తెల్లని క్యాప్‌లు ధరించి ట్రాఫిక్ విధుల్లో పాల్గొనేలా, సైబర్ మోసాలు పట్ల ప్రజల్లో అవగాహన కలిగేలా, దిశా యాప్‌పై మహిళల్లో చైతన్యం కలిగేలా వీరు సేవలందిస్తున్నారు.

రుణపడి ఉంటా..



డీఆర్‌డీఏ ద్వారా అందించిన రూ.50 వేలు రుణంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ కుటుంబ పోషణ సాగిస్తున్నా. సారా విడిచి పెట్టి మంచిగా బతికితే ఉపాధి కల్పిస్తామని పోలీసులు చెప్పి మార్పు తీసుకొచ్చారు. పోలీసులకు, ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.
– గణగళ్ల ధర్మారావు, బారువ, సోంపేట మండలం

రుణ పరిమితి పెంచాలి..



గతంలో సారా విక్రయించేవాడిని. సెబ్ పోలీసులు వద్దనడంతో మానేశాను. బీఈడీ చదువుకోవడంతో పలాస జాబ్ మేళాకు వెళ్లినా వయసు 40 ఉండటంతో వర్తించలేదు. డీఆర్‌డీఏ రుణం రూ.10వేలు ఈ మధ్యే ఇస్తారని తెలిసింది. రూ.50 వేలు ఇస్తే బాగుండేది. ప్రస్తుతం పాన్‌షాపుతో నెట్టుకొస్తున్నా.
– సాహుకారి గోవిందరావు, కల్లాడ గ్రామం, నందిగాం మండలం

మార్పు తీసుకొచ్చారు..

పోలీసులు మార్పు తీసుకొచ్చారు. సారా అమ్మకం విడిచిపెట్టా. 34 మందికి అందించిన డీఆర్‌డీఏ రుణం(రూ.11 లక్షల్లో) రూ. 50 వేలు నాకూ వర్తించింది. ప్రస్తుతం ఆటో నడుపుతున్నా.
– గునిశెట్టి శ్రీనివాస్, మామిడిజోల, మందస మండలం

సెబ్ సిబ్బంది సూచనతో..

సెబ్ సీఐ, సిబ్బంది నచ్చజెప్పడంతో సారా వృత్తి మానేశాను. డీఆర్‌డీఏ ద్వారా రూ.10 వేలు రుణం మంజూరైనట్లు వెలుగు వారు ఫోన్ చేసి చెప్పారు. ప్రస్తుతం కిరాణా షాపు నడుపుతున్నా.
– సవర దుర్యోధన, కొండలోగాం, మందస మండలం

ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నా..



జాబ్ మేళాలో పాల్గొన్నా. ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నా. గౌరవంగా బతుకుతున్నా. డిగ్రీ చదువుకున్నానని తెలిసి పోలీసులు వేరే ఉపాధి చూడమన్నారు. నాలాంటి వారికి జాబ్ మేళాలు భరోసా కల్పిస్తాయి.
– కోరాడ చిరంజీవి, కోరాడపేట, గార మండలం



సప్తమి దర్శనం ఇలా సులభతరం..



- శుక్రవారం అర్ధరాత్రి నుంచి దర్శనాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఈ నెల 28న జరగనున్న రథసప్తమి మహోత్సవానికి సూర్యదేవాలయ ప్రాంగణ, పరిసరాలు ముస్తాబవుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల (తెల్లవారితే శనివారం) నుంచి ఆలయంలో దర్శనాలు ప్రారంభించనున్నారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక రూట్ మ్యాప్‌ను బుధవారం విడుదల చేశారు. భక్తులకు వివిధ దర్శన మార్గాల వివరాలు స్పష్టంగా తెలియజేసేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో క్లాత్ బ్యానర్లు ఏర్పాటు చేస్తామని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

దాతల పాసులు

ఆలయ అభివృద్ధికి, వివిధ రకాలుగా విరాళాలు ఇచ్చిన వారికిచ్చే డోనర్ (దాతల) పాసులున్న వారు ప్రధాన రోడ్డులో బొంపాడ వీధి కూడలి నుంచి ప్రత్యేక క్యూలైన్‌లో వస్తారు. ఉత్తర ద్వారం పక్కనున్న ప్రత్యేక క్యూలైన్‌లో ఆలయం లోపలికి వెళ్లనున్నారు. ఈ పాసుతో నలుగురికి అనుమతించనున్నారు. ఈ పాసులకు 27వ తేది అర్ధరాత్రి 12 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు.

ఉచిత దర్శనాలు

అరసవల్లి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి సాధారణ (ఉచిత) దర్శనాల క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఆలయానికి ఏ వైపు నుంచి వచ్చిన భక్తులైనా ఉచిత దర్శనానికి రావాలంటే ఇదొక్కటే మార్గం. ఇంద్రపుష్కరిణికి ఆగ్నేయంగా ఉన్న మార్గం ద్వారా పుష్కరిణి చుట్టూ ఉన్న కంపార్ట్‌మెంట్ల నుంచి ఆలయంలోకి దర్శనాలకు వెళ్తారు.

రూ.100 ప్రత్యేక టికెట్ దర్శనాలు

ఈ టికెట్‌తో దర్శనాలు కూడా అరసవల్లి హైస్కూల్ నుంచే క్యూలైన్లు ప్రారంభం కానున్నాయి. వీరు మాత్రం ఇంద్ర పుష్కరిణి ఈశాన్య గేటు, కేశఖండనశాల పక్క నుంచి ఆలయంలోకి చేరుకుంటారు. ఆలయానికి ఏ వైపు నుంచి వచ్చిన భక్తులైనా రూ.100 దర్శనానికి వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. ఉచిత దర్శన భక్తులు, రూ.100 దర్శన టికెట్లు తీసుకున్న భక్తులు వేర్వేరుగా క్యూలైన్లలో వచ్చినప్పటికీ ఆలయ ప్రధాన గోపురం ముందు ఉన్న ఒకే క్యూలైన్లో కలిసిపోయి ఒకే లైన్ ద్వారా ఆలయంలోనికి దర్శనానికి వెళ్లనున్నారు.

క్షీరాభిషేక సేవ (ఇద్దరికి అనుమతి)

అరసవల్లి ప్రధాన రోడ్డులో బొంపాడ వీధి కూడలి వద్ద నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా వెళ్లనున్నారు. క్యూలైన్‌లోనే ఈ టికెట్టును రూ.500తో కొనుగోలు చేసుకున్న భక్తులు(ఇద్దరికి అనుమతి) ఆలయ ప్రధాన ఆర్చిగేట్ మీదుగా ప్రత్యేక లైన్లో దర్శనానికి వెళ్లనున్నారు. ఈ సేవ సప్తమి రోజున అర్ధరాత్రి 12.15 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే ఉంటుంది.

రూ.500 విశిష్ట దర్శనం (ఇద్దరికి అనుమతి)


బొంపాడ వీధి నుంచి ప్రారంభమైన క్షీరాభిషేక సేవ మార్గంలోనే వీరు కూడా వెళ్తారు. క్షీరాభిషేక సేవ అనంతరం అంటే ఉదయం 6 తర్వాత నుంచి రాత్రి 8 గంటల వరకు ఇదే లైన్‌లో విశిష్ట దర్శనం పేరిట (రూ.500) టికెట్టుదారులు దర్శనానికి వెళ్లనున్నారు.

వి.ఐ.పి టికెట్ (ఇద్దరికి అనుమతి)

ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన విఐపి టికెట్ (రూ.500)లను శ్రీకాకుళం ఆర్డీవో అనుమతితో అరసవల్లి యూనియన్ బ్యాంకులో కొనుగోలు చేసిన భక్తులు నేరుగా ఆలయ ప్రధాన ఆర్చిగేట్ నుంచి ప్రత్యేక క్యూలైన్లలో దర్శనాలకు వెళ్లనున్నారు. వీరు సుదర్శన మండపం వద్ద రూ.500 విశిష్ట దర్శనదారులతో కలిసిపోయి ఒకేలైన్లో స్వామి వారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

వాహనాల పార్కింగ్:

అరసవల్లి మిల్లు కూడలి వైపు నుంచి వచ్చిన వాహనాలన్నీ 80 ఫీట్ రోడ్డు వద్ద వాహనాల పార్కింగ్‌కు, స్థానిక పెద్దతోట వద్ద చెప్పుల స్టాండ్లకు ఏర్పాట్లు చేశారు. కళింగపట్నం రోడ్డు నుంచి అరసవల్లి వచ్చే భక్తుల వాహనాలను అసిరితల్లి ఆలయం వద్ద పార్కింగ్, చెప్పుల స్టాండ్ కోసం సిద్ధం చేశారు. ఇక మిల్లు కూడలి, డీసీఎంఎస్ కార్యాలయం, ప్రధాన ఆర్చిగేటు, అసిరితల్లి అమ్మవారి ఆలయం కూడలి, నగర పాలక ఉన్నత పాఠశాలల వద్ద పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నారు.



దర్శనాల రూట్ మ్యాప్ ఇదే

వీవీఐపీ భక్తులు

రాష్ట్రానికి చెందిన వీవీఐపీ స్థాయి గల ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు ఆలయ ప్రధాన ఆర్చిగేటు నుంచి నేరుగా అనివెట్టి మండపం నుంచి వెళ్లి మళ్లీ అదే మార్గంలో వెనుదిరిగేలా ఏర్పాట్లు చేశారు. వీరి వాహనాలు కూడా ప్రధాన ఆర్చిగేటు వరకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎగ్జిట్ మార్గం

ఇక సాధారణ భక్తులు, దాతలు, రూ.100, రూ.500 దర్శన టికెట్లు, రూ.500 వీఐపీ టికెట్లు భక్తులంతా స్వామి దర్శనానంతరం ఆలయ ఎగ్జిట్ ద్వారం నుంచే నేరుగా బ్రాహ్మణవీధి మీదుగా బొంపాడ వీధి కూడలి ప్రధాన రోడ్డుకు చేరుకునేలా ఈ మ్యాప్ సిద్ధం చేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు మందస విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మందస: కాకినాడలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న బేస్‌బాల్ పోటీలకు మందస విద్యార్థులు ఎంపికయ్యారు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు తెల్లి ప్రవీణ్, కె.మౌనిక, డి.నదియ, తొమ్మిదో తరగతి చదువుతున్న కె.దీక్షిత, శివానీపండా, బి.హర్షిత, జె.కావ్య, ఎస్.విశ్వామిత్ర అండర్ 14, 17 విభాగాల్లో పాల్గొననున్నారు. వీరిని బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.భాస్కరరావు, పీడీలు కార్తికేశ్వరరావుచౌదరి, రవికుమార్‌లు అభినందించారు. విజేతలై రావాలని ఆకాంక్షించారు.

న్యాయవిద్యలో ప్రవేశాలు కల్పించాలని మంత్రి బొత్సకు వినతి



మంత్రి బొత్సకు సమస్యలు వివరిస్తున్న న్యాయ విద్యార్థులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంబేడ్కర్ యూనివర్సిటీలో న్యాయవిద్యలో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణను శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం కలిసి విన్నవించారు. యూనివర్సిటీ వీసీ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లినా న్యాయం జరగడం లేదన్నారు. రెండో కౌన్సెలింగ్‌కు సంబంధించి ఇప్పటికీ బీఆర్ ఏయూ ఆప్షన్‌లో కనిపించడం లేదన్నారు. స్పందించిన మంత్రి బొత్స వీసీతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించరా? ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. మంత్రితో వీసీ ఫోన్‌లో మాట్లాడి బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా అఫ్లియేషన్ ఇవ్వడం లేదని.. ఇప్పటికే లా కోర్సు కోసం రూ. 8.50 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి విద్యార్థుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

డోనర్ పాసుల పంపిణీ ప్రారంభం



దాత మండవల్లి రవికి డోనర్ పాస్ అందజేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అరసవల్లి: రథసప్తమి సందర్భంగా ఆలయ దాతలకు ఇచ్చే డోనర్ పాసుల పంపిణీ బుధవారం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి దాతలు తమ రిసీట్స్‌తో వచ్చి పాసులు తీసుకెళ్లారు. ఈ నెల 27 సాయంత్రం పాసుల పంపిణీ జరిగేలా ఆలయంలో ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం వరకు విరాళాలు ఇచ్చిన వారికి కూడా దాతల పాసుల జాబితాలో చేర్చుకునేలా చర్యలు చేపట్టినట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, పాతపట్నం ఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. గురువారం రిపబ్లిక్ డే అయినప్పటికీ స్థానిక అరసవల్లి యూనియన్ బ్యాంకు సిబ్బంది విధుల్లో ఉంటారని, రూ.500 వీఐపీ టికెట్ల విక్రయాలు కొనసాగిస్తారని, ఆర్జీట అనుమతి పత్రంతో టికెట్లు పొందవచ్చునని ఈవో చెప్పారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ఉత్తమ అధికారులు వీరే..

- గణతంత్ర వేడుకల సందర్భంగా నేడు 221 మందికి ప్రశంసా పత్రాలు ప్రదానం
- శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో కార్యక్రమం..



రిపబ్లిక్ డే వేడుకకు సిద్ధమైన ఆర్ట్స్ కళాశాల మైదానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: గణతంత్ర వేడుకలను శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కాలేజీ) మైదానంలో గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేడుకల్లో భాగంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ రంగంలోని వివిధ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులకు పురస్కారాలను అందజేయనున్నారు. ఉత్తమ అధికారులు, ఉద్యోగులుగా 221 మందిని ఎంపిక చేసి ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. వీరిలో 72 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 216 మంది, ఐదు స్వచ్ఛంద సంస్థలకు చెందిన ఐదుగురు ఉన్నారు.

అవార్డులకు ఎంపికైన జిల్లా అధికారులు..

ఎం.కిరణ్ కుమార్, పీడీ మెప్మా. ఐ.వి.సుబ్రహ్మణ్యం, డీఎం, నెడ్‌క్యాప్. జి.వి.చిట్టిరాజు, డ్వామా పీడీ. డి.తిరుమలరావు, వంశధార ఎస్ఈ. కిల్లి మన్మథరావు, జిల్లా రిజిస్ట్రార్.

కలెక్టరేట్ నుంచి: డి.రామ్మూర్తి, సూపరింటెండెంట్ ఈ–సెక్షన్. ఎస్.ఢిల్లీశ్వరరావు, డీటీ ఏ–సెక్షన్. జి.సునిల్, జేఏ, సీ–సెక్షన్. పి.సూరి, ఏఎస్, ఏ–సెక్షన్.

సబ్ కలెక్టర్, టెక్కలి డివిజన్: పి.సరోజిని, తహసీల్దార్ మెళియాపుట్టి. బి.ప్రసాదరావు డీటీ పాతపట్నం. ఎ.లక్ష్మీప్రసన్న, ఎస్ఏ, టెక్కలి ఆర్డీవో ఆఫీస్. పి.కిరణ్, జేఏ, సంతబొమ్మాళి. గిరీష్ కుమార్ పటానాయక్, వీఆర్వో వసప. భార్గవ చంద్రదాస్, టైపిస్టు, కోటబొమ్మాళి. కె.భారతి, వీఆర్ఏ, సారవకోట.

ఆర్డీవో శ్రీకాకుళం: ఎ.సింహాచలం, తహసీల్దారు. కె.శరత్ బాబు, డీటీ. ఎం.ఎం.నాయక్, డీటీ. ఎం.శ్రావణి, ఎంఆర్ఐ. సీహెచ్ ధర్మారావు, ఎస్ఏ. సీహెచ్ ముఖలింగం, ఓఎస్. సీహెచ్ వెంకటేశ్, వీఆర్వో.

ఆర్డీవో పలాస: బి.అప్పలస్వామి, తహసీల్దార్. కె.గాయిత్రి, సీనియర్ అసిస్టెంట్. బి.లోకనాథం, జేఏ. కె.క్రిష్ణారావు, వీఆర్వో. కె.ఆదినారాయణ, ఓఎస్.

సర్వే శాఖ: జె.తిరుమలరావు, వీఎస్. ఎస్.ఎస్.వలస. గార లోకేష్, వీఎస్, అక్కివలస. సూరు నవీన్, వీఎస్, వాడాడ.

సివిల్ సప్లయ్ డిపార్టుమెంటు: కె.సంతోష్‌కుమార్, సీఎస్ డీటీ. బి.ఉదయ్‌కుమార్, జేఏ.

సివిల్ సప్లయ్ కార్పొరేషన్: ఎం ఉమామహేశ్వరరావు, డీటీ.

పోలీసు శాఖ: ఎం.మధుసూదనరావు, ఎస్సై. టి.నర్సింగరావు, ఏఎస్సై. బి.జాన్సీ, మహిళాపోలీస్. డి.సురేష్‌రావు, పీసీ. ఎస్.కె. సమ్యుల, ఏఆర్ హెచ్‌సీ. ఎ.తిరుమలేశ్వరరావు, ఏఆర్ పీసీ. పి.ఢిల్లీరావు, ఏఎస్సై. ఎం.ఆదేన్న, హెచ్‌సీ. పి.నారాయణరావు, ఏఎస్సై. డి.వి.రమణమూర్తి, హెచ్‌సీ. బి.పూర్ణారావు, హెచ్‌జీ. పి.జగన్నాథ, హెచ్‌జీ. బి.అన్నపూర్ణ, డబ్ల్యూహెచ్‌జీ. ఎం.శ్రీనివాసులునాయుడు, జూనియర్ అసిస్టెంట్. ఎస్.నవీన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్. బి.మోహనరావు, పీసీ. బి.రమేష్. ఎం.ప్రవల్లిక, డబ్ల్యూఎస్సై. ఎ.జయకుమార్, ఎస్సై. జి.శ్రీనివాసరావు, డీఎస్పీ. టి.సత్యమూర్తి, ఇన్‌స్పెక్టర్, కమ్యూనికేషన్.

విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు: జి.ప్రేమ్‌కుమార్, ఏఈ ఇంజినీర్.

ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో: టి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్. ఎస్.మురళీధరరావు, ఎస్ఏ. ఇ.సంతోష్ కుమార్, కానిస్టేబుల్. ఇ.సూర్యకుమార్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్. టి.రేవతి, జేఏ. కె.దాలినాయుడు, కానిస్టేబుల్.

విజిలెన్సు: బి.శ్రీరామమూర్తి, ఏసీ.

జైలు శాఖ: డి.శ్రీనివాసు, హెడ్ వార్డెన్. జి.శ్రీనివాసరావు, వార్డర్.

సబ్ జైళ్లు: కె.జానకీరామకృష్ణ రావు, జూనియర్ అసిస్టెంట్.

అగ్నిమాపకశాఖ: కె.విశ్వనాథం, లీడ్ ఫైర్‌మెన్. ఎస్‌కే రహీం, డ్రైవర్ ఆపరేటర్. జె.ప్రకాశ్, ఫైర్‌మెన్.

అటవీ శాఖ: పి.యశశ్వి, ఎఫ్ఎస్‌వో. పి.జనప్రియ, ఎఫ్‌బీవో.

ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటు: పి.రాఘవేంద్ర, ఎస్ఏ. పి.వి.గంగాధరరావు, ఎంవీఐ. డీపీ రంగారావు, ఎంవీఐ.

ఐటీడీఏ: ఎస్.లక్ష్మి, ఓఎస్. ఎస్.నాగభూషణం, డీఈవో.

సీపీవో కార్యాలయం: వి.సుజాతాకుమారి, డీఎస్‌వో. ఎ.మనోజ్‌కుమార్, డీఈవో. బి.జి.మనోహర్, ఏఎస్‌వో.

డీఆర్‌డీఏ: ఐకేపీ: ఎ.నాగలక్ష్మి, డీపీఎం.

మెప్మా: పి.మనోహరరావు, సీఎంఎం. బి.భాస్కరరావు, టీఎంసీ. డి.సంతోష్ కుమార్, సీవో.

డీడబ్ల్యూఎంఏ: ఎం.రవికుమార్, డిప్యూటీ ఎస్‌వో. బి.పార్వతి, ఏపీవో. ఎస్.గౌరీకృష్ణ, ఇంజినీరింగ్ కన్సల్టెంట్. డి.త్రినాథరావు, టెక్నికల్ అసిస్టెంట్. ఎం.అనిల్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్. సవర రాజ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్.

సోషల్ వెల్ఫేర్: ఎస్.కృష్ణకుమారి, సూపరింటెండెంట్. బి.రవికుమార్, హెచ్‌డబ్ల్యూవో. పి.చిన్నమ్మ, హెచ్‌డబ్ల్యూవో.

బీసీ కార్పొరేషన్: కె.మధుబాబు, సీనియర్ అసిస్టెంట్.

బీసీ వెల్ఫేర్: పి.యతిరాజులు, హెచ్‌డబ్ల్యూవో. పి.గోవిందమ్మ, అటెండర్.

దివ్యాంగుల శాఖ: ఎం.జానకీ, కె.వెంకట్రావు, వోఎస్.

ఎస్సీ కార్పొరేషన్: ఎన్.సత్యదేవ్, ఏఈవో.

కోపరేటివ్ శాఖ: బి.మల్లిబాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్

హౌసింగ్ డిపార్టుమెంటు: జి.రామమూర్తి, డిప్యూటీ ఈఈ. ఎస్.కుమార్ శేఖర్, ఓఎస్, డీఈవో. బి.వి.భాస్కరావు, ఎన్‌టీడబ్ల్యూఐ.

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్: బి.చంద్రశేఖరరావు, రికార్డు అసిస్టెంట్. కె.లలితారావు, స్వీపర్. కె.సుందరరావు, పబ్లిక్ హెల్త్ వర్కర్. వై.శ్యామలరావు, ఫిట్టర్. ఆర్.సతీష్‌కుమార్, ఎలక్ట్రీషన్.

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ: జి.ముకుందరావు, సెక్రటరీ. ఎం.చిన్నమురళీకృష్ణ, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ.

పంచాయతీ రాజ్ శాఖ: ఎం.వి.రంగారావు, ఏవో అడ్మిన్‌స్ట్రేటివ్, జెడ్పీ. జి.తులసీదాస్, ఎస్ఏ, జెడ్పీ స్కూల్. సోమేశ్వర పాడీ, సీసీ జెడ్పీ. ఆర్.నారాయణరావు, రికార్డు అసిస్టెంట్. పి.సూర్యనారాయణ, ఎంపీడీవో. బి.మధుసూదనరావు, ఎంపీడీవో. ఎం.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో. తిరుపతి పట్నాయక్, ఏవో. అజిత్ కుమార్ మిశ్ర, ఎస్ఏ. బి.యుగంధర్, టైపిస్టు. బి.సంతోషి, టైపిస్టు.

జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీవో): ఎస్.హరిహరరావు, ఈవో. పి.వెంకటరాజు, ఎంపీడీవో. ఎం.భాస్కరరావు, పీఎస్. సీహెచ్ మల్లేశ్వరరావు, పీఎస్.

పీఆర్ ఎస్ఈ ఇంజినీరింగ్: ఆర్.గిరిధర్, ఈఈ. ఎస్.రాధారాణి, డీఈఈ.

ఆర్‌డబ్ల్యూఎస్: ఎం చంద్రమౌళి, ఏఈఈ. డి.దివ్య, ఏఈఈ. ఎ.దయాసాదర్, ఎస్ఏ.

ఆర్అండ్‌బీ, పబ్లిక్ వర్కు: ఎ.తిరుపతిరావు, డీఈఈ. ఎస్.ప్రదీప్‌కుమార్, సీనియర్‌అసిస్టెంట్.

వైద్య ఆరోగ్యశాఖ: ఎం. శ్రవంతి, మెడికల్ ఆఫీసర్. ఆర్.వెంకట్రావు, సీహెచ్‌వో. బి.శివప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్. సునీత పట్నాయక్, ఏఎన్ఎం. ఎస్.సుశీల, ఆశ కార్యకర్త.

డీసీహెచ్ఎస్ శాఖ: ఎం.సుధారాణి, మెడికల్ ఆఫీసర్. ఎన్.విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్.

డ్రగ్స్ కంట్రోల్ అండ్ అడ్మినిస్ట్రేషన్: జి.సంతోష్‌కుమార్, డీఈవో.

జిల్లా టీబీ, ఎయిడ్స్, లెప్రసీ కంట్రోల్ ఆఫీస్: కె.ఉమామహేశ్వరరావు, డీపీఎం.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ: పి.వి.రమణ, టీం లీడర్.

జిల్లా విద్యాశాఖ: వి.రామారావు, ఏఎస్‌వో. సీహెచ్ శ్రీనివాసరావు, ఎంఈవో. బి.జయకృష్ణ, జూనియర్ అకౌంటెంట్.

సమగ్రశిక్షా అభియాన్: ఎస్.హరికృష్ణ, సీఎంఓ. డి.రవికుమార్, డీఈవో. సి.బాలరాజు, ఎంఎంసీ కోఆర్డినేటర్.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు: వి.ఎల్.పాల్, లెక్చరర్. డి.స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్. వైపీ నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్.

ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఈ సొసైటీ: డి.మోహనరావు, ఆర్ట్ టీచర్, త్రినాథరావు, పీజీటీ.

వయోజన విద్య: పి.శ్రీను, డీఈవో.

ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం: టి.శ్రీలత, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త

డైట్ వమరవల్లి: ఎం.భారతమ్మ, లెక్చరర్.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం: ఎస్.ఉదయ్‌కుమార్, డీన్. ఎల్.అప్పారావు, సూపరింటెండెంట్.

వ్యవసాయ శాఖ: బి.నర్సింహమూర్తి, ఎంఏవో. ఎస్.ధానకర్ణుడు, ఎంఏవో. అల్లశెట్టి అరుణ మణి, వీఏఏ.

ఉద్యానవనశాఖ: ఎం.మంగమ్మ, జి.రాధిక

మార్కెటింగ్ శాఖ: పి.శ్రీనివాసరావు, సెక్రటరీ.

పశు సంవర్థక శాఖ: టి.శిరీష, వీఏఎస్. డి.గుణాలు, లైవ్ స్టాక్ అసిస్టెంట్.

బీఆర్ఆర్ వంశధార: ఎస్.శరత్‌కుమార్, ఏఈఈ. ఎ.చక్రధర్, టైపిస్టు.

ఇరిగేషన్ శాఖ: కె.రాంబాబు, ఏఈఈ. మధుసూదన పాణిగ్రహి, ఏఈఈ.

భూగర్భజల శాఖ: ఎ.లక్ష్మణరావు, ఏపీడీ. కె.రమణమ్మ, ఓఎస్.

ఖజానా శాఖ: పి.సావిత్రి, ఏటీవో. ఎం.సాయిప్రసాద్, ఏటీవో. ఐ.జ్యోతి లక్ష్మి, ఎస్‌టీవో. ఎ.శ్రీనివాసరావు ఎస్ఏ

ఏపీఈపీడీసీఎల్: కె.ఇందిర, డీఈఈ. కె.కమలహాసన్, ఏఈ. పి.తాతాచార్యులు, ఎస్ఏ

లీడ్ బ్యాంకు: ఎస్.మధుసూదనరావు ఎస్‌బీఐ బీఎం. బి.లలితారాణి, బీఎం, ఏపీజీవీబీ. ఇప్పిలి సీతారత్నం, బీఎం, డీసీసీబీ.

మైన్స్ అండ్ జియాలజీ: కె.మాణిక్యాలరావు, రోయల్టీ ఇన్‌స్పెక్టర్

కార్మిక శాఖ: ఎల్.రాజ్యలక్ష్మి, ఎస్ఏ. ఎస్.ఢిల్లీశ్వరరావు, వోఎస్

ఎండోమెంట్ విభాగం: జి.గురువుందరావు, ఈవో. వి.వి.ఎస్.నారాయణ, ఈవో

ఐఅండ్‌పీఆర్: కె.రాజు, ఫొటోగ్రాఫర్. కె.పుణ్యవతి, ఏఐ

సెట్‌శ్రీ: బి.వెంకటలక్ష్మి, లెక్చరర్ టూరిజం. పి.బి.కె.శర్మ, స్కూల్‌అసిస్టెంట్,

మత్స్య శాఖ: ధర్మరాజు పాత్రో, డివిజినల్ ఎఫ్‌వో. ఎం. ఈశ్వరరావు, డివిజినల్ ఎఫ్‌వో. ఎం.బలరామకృష్ణ, డీపీఏ

జిల్లా గ్రంథాలయ సంస్థ: ఎం.శ్రీనివాసరావు, లైబ్రేరియన్

చేనేత, కార్మిక శాఖ: కె.ముఖర్జీ, ఏడీవో

రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖ: టి.కుసుమకుమారి, ఎస్ఏ. బి.జ్యోతి, జేఏ

సైనిక్ సంక్షేమం: బైరి మురళి, టైపిస్ట్

ఏపీఎస్ స్కిల్ డెవలప్‌మెంటు: కె.ఢిల్లేశ్వరరావు ఈడీఈ. బెండి స్వప్నదేవి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్

మహిళా సంక్షేమ శాఖ: కె.ఆదిలక్ష్మి, ఈవో. కె.హైమావతి, ఓఎస్. పి.శిరీషాపాల్, జేఏ. టి.పాపారావు, డీఈవో. పి.సాయికుమార్, హోంగార్డు.

టి.మాధవరావు, బ్లాక్ ప్రాజెక్టు కోఆర్డినేటర్. వై.హిమబిందు, సీఏ. ఎ.గీత, అవుట్ రీచ్ వర్కర్

జిల్లా స్పోర్ట్సు అథారిటీ: వి.లక్ష్మణరావు, తైక్వాండో. ప్రగడ ఝాన్సీ, కబడ్డీ

ఏపీఎస్ ఆర్టీసీ: డి.వి.రాజు, డ్రైవర్. డి.ఎం.రావ్, కండక్టర్. ఐకేరావు కండక్టర్

ఉన్నత సేవలు అందించిన ఏపీ సేవా సంస్థ: పాతనౌపడ, టెక్కలి డివిజన్, మండలం. పోలాకి మండలం, శ్రీకాకుళం డివిజన్

స్వచ్ఛంద సంస్థలు: వావిలాపల్లి జగన్నాథరావు, లయన్స్‌క్లబ్. బి.సురేష్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్. సీహెచ్ నాగేశ్వరరావు, ఈడీ, బొల్లినేని మెడిస్కిల్స్. ప్రభాకర్, దివీస్ లేబరేటరీ. కె.యామిని, కల్చరల్, కూచిపూడి ఫ్యాకల్టీ.

సులభతర విధానాలతో మెరుగైన సేవలు

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: బ్యాంకులు సులభతర విధానాలను అనుసరించి ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో జెడ్పీలో బుధవారం జిల్లా సంప్రదింపుల మండలి, జిల్లా స్థాయి సమీక్షా మండలి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాల ద్వారా ప్రయోజనాలు పొందుతున్న లబ్ధిదారులకు మెరుగైన సేవలందించేందుకు మరింత కృషి చేయాలన్నారు. జగనన్న తోడు ఆరో విడత, చేనేత కార్మికులకు ఆర్థిక చేయూత, వ్యవసాయ, విద్య, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఆర్థిక స్వావలంబన, పీఎంఏవై, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, ఆర్థికసాక్ష్యరత తదితర అంశాలపై బ్యాంకులు సాధించిన లక్ష్యాలపై సమీక్షించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన మంచి పథకమన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం మరికొంత సాయం చేస్తోందన్నారు. మత్స్యకారులందరికీ ఇది ప్రయోజనకరమైన పథకమన్నారు. మత్స్య శాఖ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి మత్స్యకారుడు సద్వినియోగం చేసుకునేలా బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, టిడ్కో గృహ నిర్మాణ రుణాలను కూడా లబ్ధిదారులకు సకాలంలో మంజూరు చేయాలన్నారు. రబీ, ఖరీఫ్ కాలానికి సకాలంలో రుణాలను మంజూరు చేసి రైతులకు సహకరించాలని ఆదేశించారు. జగనన్నతోడు ఆరో విడత, విద్య, వ్యవసాయ రంగాలకు పూర్తిగా సహకరించి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. నగదు రహిత లావాదేవీలు జిల్లాలో శతశాతం అమలయ్యేలా ఫైనాన్షియల్ లిటరసీ ప్రోగ్రామ్ పక్కాగా అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.వరప్రసాద్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ జి.వి.బి.డి.హరిప్రసాద్, ఆర్‌బీఐ ఎల్‌డీవో అనిల్‌కుమార్, యూబీఐ డిప్యూటీ రీజనల్ అధికారి దుర్గాప్రసాద్, నాబార్డ్ డి.డి.ఎం వరప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డి.వి.విద్యాసాగర్, పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు బాబా వార్షికోత్సవం

- ఏర్పాట్లు పూర్తి
- సుమారు లక్షన్నర మంది భక్తులు వచ్చే అవకాశం



స్వామి వద్ద ఉంచేందుకు సిద్ధం చేసిన కోటి నామాల సాయి పుస్తకాలు



పాదయాత్రగా తరలివస్తున్న సాయి భక్తుల

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలోని షిర్డీ సాయి బాబా వంద అడుగుల వెంకట సాయి కోటి మహాస్థూపం 21వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ప్రధాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో భాగంగా తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి సాయి కోటి నామాల పుస్తకాలను స్వామి పాదాల వద్ద సమర్పించేందుకు సుమారు లక్షన్నర మంది తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నెల 19వ తేదీ నుంచి వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. 46 అడుగుల నాగసాయి, ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నామని సాయి ప్రచారక్, ఆలయ నిర్మాత మక్క వెంకటసాయి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి సాయి భక్తులు తరలివస్తున్నట్లు చెప్పారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

- రహదారిపై బైఠాయించిన గిరిజనులు



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్సై నారాయణస్వామి

హిరమండలం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన బాధిత కుటుంబాలకు న్యాయం చేసి ఆదుకోవాలని కొత్తూరు మండలం పెద్దరాజపురం గ్రామానికి చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట అలికాం–బత్తిలి ప్రధాన రహదారిపై బుధవారం బైఠాయించారు. ఈ సందర్భంగా సవర చిన్నారావు, శైలేష్, నిమ్మక రామకృష్ణలుతో పాటు పలువురు ఆదివాసీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీ పరిధి పాండ్రమనిగూడ, పెద్దరాజపురం గ్రామానికి చెందిన సవర కూర్మయ్య, శ్యాముల్, జోగారావులు ద్విచక్ర వాహనంపై హిరమండలం నుంచి కొత్తూరు వైపు వెళ్తుండగా కొండరాగోలు గ్రామం సమీపంలో ట్రాక్టర్లు ఢీకొట్టినట్టు చెప్పారు. ఈ ప్రమాదంలో సవర కూర్మయ్య అక్కడికక్కడే చనిపోగా మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు చెప్పారు. వీరిని నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సవర జోగారావు బుధవారం మృతి చెందినట్టు పేర్కొన్నారు. కూర్మయ్య, జోగారావు మృతదేహాలకు వారి కుటుంబ సభ్యులు లేకుండానే పోస్టుమార్టం జరిపించేందుకు తరలించడం పోలీసులకు తగదన్నారు. పోలీసుల తీరుకు నిరసనగానే పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. చనిపోయినవారు నిరుపేదలని.. వారి కుటుంబాలకు న్యాయం చేసి ఆదుకోవాలన్నారు. సంఘటన జరిగిన ప్రాంతంలో రెండు ట్రాక్టర్లు ఉన్నప్పటికీ ఒకదాన్ని మాత్రమే పోలీసులు అదుపులో తీసుకున్నారన్నారు. రాత్రి ఏడు గంటల వరకు నిరసన తెలిపినప్పటికీ ప్రమాదానికి బాధ్యులైన వారిని వెతుకుతున్నామని పోలీసులు చెబుతున్నారు తప్పితే ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు వద్ద ప్రస్తావించగా.. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు అధికారులు గిరిజనులతో మాట్లాడి.. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. హిరమండలం, కొత్తూరు ఎస్సైలు జి.నారాయణస్వామి, గోవిందరావులు ఉన్నారు.

ప్రజా సేవలో ఆర్టీసీ

- స్పీకర్ తమ్మినేని సీతారాం



బస్సులో ప్రయాణిస్తున్న స్పీకర్ తమ్మినేని తదితరులు

ఆమదాలవలస: ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన రెండు నూతన బస్సులను బుధవారం ప్రారంభించారు. తొలి టిక్కెట్ కొనుగోలు చేసి కొద్ది దూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపల్లెకు రవాణా సదుపాయాన్ని పెంచి ప్రయాణికుల మనసులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుచుకున్నారన్నారు. ఇప్పటికే ఆర్టీసీని ప్రభుత్వ పరం చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సంస్థలో పనిచేస్తున్న వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందారన్నారు. ప్రజలకు రవాణా పరంగా విస్తృత సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీపీటీఓ కె.శ్రీనివాసరావు, డిపో–1 మేనేజర్ కె.మాధవ్, డిపో–2 ట్రాఫిక్‌మేనేజర్ గంగరాజు, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు శిల్లా మల్లికార్జునరావు, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ కుసుమంచి శ్యాంప్రసాద్, పార్టీ నాయకులు చిన్నారావు, చిరంజీవి పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో చోరీ

- 3.5 తులాల బంగారు, 2 తులాల వెండి ఆభరణాలు అపహరణ

లావేరు: లావేరు గ్రామంలోని కనకదుర్గ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో 3.5 తులాల బంగారు, రెండు తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు అర్చకులు నేతేటి రుషికుమార్‌శర్మ, ఆలయ ధర్మకర్త నిడిగంట్ల త్రినాథ్‌లు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఆలయానికి మంగళవారం రాత్రి ధర్మకర్త నిడిగంట్ల త్రినాథ్ తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఆలయం తలుపులు తెరవడానికి ధర్మకర్త త్రినాథ్ రాగా అప్పటికే తాళాలు విరగొట్టి తలుపులు తీసి ఉండటాన్ని గమనించారు. దీంతో విషయాన్ని అర్చకులు రుషికుమార్‌శర్మకు తెలియజేశారు. అయన కూడా ఆలయం వద్దకు చేరుకొని ఆలయం లోపలికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. 3.5 తులాల బంగారు, రెండు తులాల వెండి ఆభరణాలు చోరీకు గురైనట్లు గుర్తించి లావేరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో జేఆర్‌పురం సీఐ ఆదాం, లావేరు హెచ్‌సీ రామారావులు ఆలయం వద్దకు చేరుకున్నారు. ధర్మకర్త, అర్చకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం స్టీల్ గేటుకు వేసిన తాళాలను విరగొట్టి దొంగలు ఆలయంలోకి వెళ్లినట్టు గుర్తించారు. ఆలయం లోపల అమ్మవారి ఆభరణాలు భద్రపరిచే బీరువా తాళాలు విరగొట్టి అందులోని సామాన్లను చిందర వందరగా పడేశారు.

బీరువాలో, అమ్మవారి గర్భగుడి ముందు ఉన్న తులుపులను తీసేసి అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న బంగారు ఆభరణాలను, గర్భగుడిలోని వెండి వస్తువులను పట్టుకుపోయినట్టు భావిస్తున్నామని ఆలయ ధర్మకర్త, అర్చకుడు పోలీసులకు వివరించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్ సిబ్బంది వచ్చి ఆలయంలో వివరాలు సేకరించారు.